ప్రజాశక్తి
శుక్రవారం 5 మే 2023
5
పార్వతీపురం మన్యం



జీడి పిక్కలకు గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

ప్రభుత్వం జీడి పిక్క బ్రతుకు పక్కా అనే నినాదంతో గిరిజనులకు రక్షణ కల్పించామనే ప్రకటన తప్ప జీడి పంటకు గిట్టుబాటు ధరిలేదనీ గిరిజన సంఘం అధ్యక్ష, కార్యదర్శుల శ్రీధర్పు అప్పారావు, మండంగి శ్రీనివాసరావు అన్నారు. గురువారం బెలగాంలోని సుందరయ్య భవనంలో గిరిజన సంఘం నాయకులు పత్రిక విలేకరులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రమకు తగిన ఫలితం లేదనీ, కేజీ పిక్కలుకు 200 రూపాయలు ఇచ్చి కోనాలని గిరిజన సంఘం డిమాండ్ చేస్తుందన్నారు. ఇప్పుడు దళారీలు, వ్యాపారులు మండలాలలో కేజీ కి 90 రూపాయలు ఇచ్చి దోపిడీ చేస్తున్నారనీ, జీడిపప్పు ధర మాత్రం కేజీ రూ.500కు అమ్ముకుంటున్నారనీ అన్నారు. దళారులు గిరిజనులను దోపిడీ చేస్తున్నారన్నారు. ఈ దోపిడీ నుండి మన్యం జిల్లా కలెక్టర్, గిరిజన అధికారులు కాపాడాలని కోరారు. ఈ సమావేశంలో గౌరవాధ్యక్షులు మండంగి రమణ, ఉపాధ్యక్షులు కే రామస్వామి, తిరుపతిరావు పాల్గొన్నారు.



ఉద్యమాల ఊపిరి.. శేషగిరి

నేడు రెండో వర్ధంతి

అందరూ గిరి లేదా మాస్టారూ అని ఆప్యాయంగా పిలిచే శేషగిరి కన్నుమూసి రెండేళ్లు గడిచిపోయింది. ఉపాధ్యాయ నాయకుడిగా, ప్రజాతంత్ర ఉద్యమ కార్యకర్తగా, అధ్యయన శీలిగా, అభ్యుదయ రచయితగా, పోరాటంలో సృజనాత్మక శిల్పిగా, ముక్కుసూటి మనిషిగా, ఎడ్యుకేటర్‌గా ఇలా ఒకటేమిటి సమాజంలో బహుముఖ పాత్ర పోషించారు. శేషగిరి 48 ఏళ్ల జీవిత కాలంలో 28 ఏళ్లు ఉద్యమమే ఊపిరిగా జీవించారు. నిత్యం ఉద్యోగుల, ప్రజల సంక్షేమం కోసం పరితపించారు.

- ప్రజాశక్తి, విజయనగరం

సాహితీ ఆలోచన నుండి ఉద్యమంలోకి

ఉద్యమ కుటుంబంలో పుట్టిన శేషగిరి వామపక్ష భావజాలం గల వ్యక్తి. చిన్ననాటి నుంచే అభ్యుదయ భావాలు గలవాడు. విద్యార్థిగా ఉన్నప్పుడే తన సహచరులతో కలిసి ఓ సాహిత్య పత్రిక స్థాపించేందుకు ప్రయత్నించారు. అనంతర కాలంలో సమాజంలో నెలకొన్న దురాగతాలను ఎండగట్టేందుకు కవులు, రచయితలతో సంబంధాలు పెంచుకున్నారు. తరువాత 1992 నుండి 94 వరకు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శిగా జిల్లాలో విద్యార్థి ఉద్యమ అభివద్ధికి కృషి చేశారు. తరువాత ఉపాధ్యాయ ఉద్యమంలో పనిచేసినప్పటికీ విద్యార్థి సంఘం నాయకుల సైద్ధాంతిక, రాజకీయ స్థాయి పెంచడం, ఉద్యమం పట్ల వారిలో విశ్వాసం పెంచడంతో పాటు వారి వ్యక్తిగత యోగక్షేమాలు చూసేవారు.

సూటా ఉద్యమంలో కీలక పాత్రధారి

ఎన్‌టి రామారావు రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత 1994 డిఎస్‌సిలో అవకతవకలు జరిగాయని డిఎస్‌సిని రద్దు చేశారు. ప్రభుత్వం తప్పుడు నిర్ణయం వెనక్కి తీసుకొని 1994 డిఎస్‌సిలో ఉత్తీర్ణులైన వారిని ఉపాధ్యాయులుగా నియమించాలని విజయనగరం నుండి ఉద్యమం ప్రారంభమైంది. ఆ నాయకత్వంలో శేషగిరి ముఖ్యుడు. ఆ ఉద్యమాన్ని రాష్ట్రమంతా విస్తరింప జేయడం, పోరాటాలు రూపొందించడంలో ప్రముఖమైన పాత్ర నిర్వహించారు. రెండేళ్లు ఉధృత పోరాటాల అనంతరం ఎన్‌టి రామారావు ప్రభుత్వం నిర్ణయం మార్చుకొని 1994 డిఎస్‌సిలో ఉత్తీర్ణులైన వారిని ఉపాధాయులుగా నియమించింది.

యుటిఎఫ్ విస్తరణలో ముఖ్య పాత్రధారి

ఉపాధ్యాయ సమస్యలపై అత్యంత సృజనాత్మకంగా పోరాటాలు నడిపేవారు. ఆ పోరాటిమతోనే జిల్లా కార్యదర్శిగా, అధ్యక్షునిగా, ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శిగా ఎదిగారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, కార్యకర్తలతో విస్తృతమైన సంబంధాలు ఉండడంతో ఫ్యాప్టో చైర్మన్‌గా ఎన్నికయ్యారు. శేషగిరి నిరంతర అధ్యయన శీలి. సిద్ధాంత అధ్యయనమే గాక స్థానిక సమస్యలపై అధ్యయనం చేసేవారు. ఉపాధ్యాయుల, విద్యా సంబంధిత సమస్యలను అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి నిర్దిష్టమైన కార్యాచరణ చేసేవారు. అందుకే ఉపాధ్యాయులందరికీ ఆప్తుడయ్యారు. అందరికీ ఆమోదయోగ్యమైన నాయకుడయ్యాడు.

సైద్ధాంతిక కృషీవలుడు

తొలి నుంచీ ప్రజాతంత్ర విప్లవ సాధన కోసం పరితపించే గిరి మాస్టారు ఓ వైపు ఉపాధ్యాయ సమస్యలపై పోరాడుతునే జిల్లాలో జనవిజ్ఞాన వేదిక ఏర్పాటు నుంచి పనిచేశారు. అనంతరం టీచర్ అండ్ స్టడీ సర్కిల్ పేరిట సమకాలిన అంశాలపై జిల్లా, డివిజన్ స్థాయిలో సదస్సులు క్రమం తప్పకుండా నిర్వహించేవారు. కొంతకాలానికి దానిపేరు గురజాడ విజ్ఞాన కేంద్రంగా మారింది. దాని ద్వారా సదస్సులు, సెమినార్‌లు, స్టడీ సర్కిల్స్ నిర్వహిస్తూ మధ్యతరగతి ఉద్యోగుల్లో రాజకీయ, సైద్ధాంతిక అవగాహన పెంచేందుకు కృషిచేశారు. అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, విద్యార్థి, యువజన సంఘాలను కలుపుకొని కార్యాచరణకు పూనుకొనేవారు. ప్రదర్శనలు, బహిరంగ సభలకు వందలు, వేలాది మందిని సమీకరించేవారు. అందువలనే జిల్లాలో ఐక్య ఉద్యమాల రథసారథిగా శేషగిరి అందరి మన్ననలు పొందారు.

విధానాలపై పోరాట యోధుడు


నాడు సిపిఎస్, నేడు నూతన విద్యావిధానంపై లోతైన అధ్యయనం చేసి అంతే పట్టుదలగా ఉపాధ్యాయులను, విద్యార్థులను కదిలించడంలో శేషగిరి ముఖ్య పాత్రధారి. సిపిఎస్ ముప్పును గుర్తించిన తొలి రోజుల్లో విజయనగరం జిల్లాలో ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించారు. మోడీ ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానాన్ని సమూలంగా అర్థం చేసుకొని దానిపై ప్రతి హైస్కూల్ స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించి, అన్ని సంఘాల నాయకత్వాన్ని ఒప్పించి పెద్ద పెద్ద ప్రదర్శనలు, సభలు నిర్వహించారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీరణ విధానాలపై సర్వత్రా వెలువడుతున్న వ్యతిరేకతను కూడగట్టి అందరినీ ఒకచోటకు చేర్చి సంఘటితం చేయాలనే ఉద్దేశంతో 18-4-2021న విజయనగరంలో శేషగిరి నిర్వహించిన సభ అతని జీవితంలో చివరిది.

ఉద్యమ విస్తృతే నిజమైన నివాళి

ఉపాధ్యాయ ఉద్యమం, ప్రజాతంత్ర ఉద్యమం వేగంగా ఎదుగుతున్న ఉద్యమ నేతను కోల్పోయింది. శేషగిరి వదిలి వెళ్లిన ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లి ఆయన లేని లోటును భర్తీ చేసుకోవడమే శేషగిరికి ఉద్యమ శ్రేయోభిలాషులంతా ఇవ్వగలిగే నిజమైన నివాళి.

నేడు వర్ధంతి సభ

పార్వతీపురంలోని ఎన్‌జిఒ హోమ్‌లో శుక్రవారం శేషగిరి మాస్టారు వర్ధంతి నిర్వహిస్తున్నట్లుగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్ మురళీమోహన్‌రావు, గురువారం తెలిపారు. వర్ధంతి సందర్భంగా యుటిఎఫ్ సభ్యులు రక్తదానం చేస్తారని వెల్లడించారు.



స్మార్ట్‌టౌన్‌షిప్ బ్రోచర్లను విడుదల చేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

వారి కోసమే స్మార్ట్ టౌన్‌షిప్

ప్లాట్ల అమ్మకాలను ప్రారంభించిన డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు

మధ్యతరగతి ప్రజల కోసమే ప్రభుత్వం జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ లేఅవుట్లను ప్రారంభించినట్లు డిప్యూటీ సిఎం రాజన్నదొర తెలిపారు. గురువారం పట్టణంలోని శివాలయం వీధిలో ఉన్న సీతారామ ధర్మశాలలో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ ప్లాట్ల అమ్మకాలను ఆయన బుడా చైర్ పర్సన్ ఇంటి పార్వతి, వైస్ చైర్మన్ మయూర్ అశోక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 35 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసిన ఘనత సిఎం జగన్ మోహన్ రెడ్డి దేనని చెప్పారు. పేదల కోసం నిర్దేశించిన జగనన్న లేఅవుట్ల మాదిరిగానే మధ్యతరగతి ప్రజల కోసం జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లను ప్రారంభించినట్లు తెలిపారు. 18 లక్షల వార్షికాదాయంలోపు ఉన్న ఉద్యోగులు, వ్యాపారులు స్మార్ట్ టౌన్‌షిప్ లేఅవుట్లలో ప్లాట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. చదరపు గజం రేటు ఐదువేల రూపాయలంటే చాలా తక్కువేనని, అవకాశం ఉన్న వారంతా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్ హెచ్.శంకరరావు పాల్గొన్నారు.

సర్పంచులను సంప్రదిస్తూనే పనులు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - మక్కువ

పంచాయతీల్లో జరిగే సంక్షేమ ప్రభుత్వ పథకాలు అమలు సర్పంచ్‌కు తెలియజేస్తూ ముందుకు వెళ్తామని ఉద్యానవన శాఖ అధికారిని ప్రత్యూష భాను తెలిపారు. ఎస్ పెద్దవలస పంచాయతీలో గురువారం రైతులతో, స్థానిక సర్పంచ్ రమణమ్మ సమక్షంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈనెల 1వ తేదీన అధికారుల తీరుపై సర్పంచ్ ఆగ్రహం అన్న శీర్షికతో ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఉద్యాన శాఖ అధికారిని గ్రామస్థాయి ఉద్యాన శాఖ అధికారి పై రైతులతో చర్చించారు. ఇకపై ఎలాంటి కార్యక్రమమైన స్థానిక సర్పంచ్‌కు తెలియజేస్తామని గ్రామస్థాయి ఉద్యాన శాఖ అధికారి, ఉద్యాన శాఖ అధికారిని ప్రత్యూష భానుకు తెలియజేశారు. పంట నష్ట పరిహారాలు, ఈ క్రాఫ్ వివరాలు జాబితాను ఆర్బికే దగ్గర పొందుపరుస్తామని ఎవరికి ఎటువంటి సందేహాలు ఉన్నా వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పూడి రమణమ్మ పాల్గొన్నారు.

బైపాస్ మంజూరు చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నిశాంత్, జెసి, డిఆర్ఒ

పార్వతీపురం పట్టణానికి బైపాస్ రహదారి మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ కోరారు. పార్వతీపురం మన్యం జిల్లా ప్రధాన కేంద్రానికి బైపాస్, జాతీయ రహదారితో అనుసంధానం అవసరమని జిల్లా కలెక్టర్ అన్నారు. జిల్లా కలెక్టర్ లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి రీ సర్వే, జాతీయ రహదారులకు భూసేకరణ, వ్యవసాయం, ఉద్యానవనాలు, గృహ నిర్మాణం, పంచాయతీరాజ్ శాఖల ప్రగతిని గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణం గుండా ఒడిషా రాష్ట్రం రాయగడ ఇతర ప్రాంతాలకు భారీ వాహనాలు వెళుతున్నాయని, తద్వారా రద్దీ ఎక్కువగా ఉందని ఆయన వివరించారు. వంద కిలో మీటర్ల నిడివి గల చిలకపాలెం (ఎన్.హెచ్ 16) - రామభద్రాపురం (ఎన్.హెచ్ 26)- పార్వతీపురం - రాయగడ (ఎన్.హెచ్ 326) రహదారి, ఆముదాలవలస, పాలకొండ, వీరఘట్టం, కూనేరు మీదుగా రాయగడను కలిపే 145 కిలో మీటర్ల కళింగపట్నం - శ్రీకాకుళం - పార్వతీపురం (సి.ఎస్.పి రోడ్) రహదారి పార్వతీపురం గుండా వెళుతుందని, వీటిని అభివృద్ధి చేయడం ద్వారా జిల్లా ప్రధాన కేంద్రానికి మెరుగైన అనుసంధానం జరిగి ప్రాంత అభివృద్ధికి దోహదం చేస్తుందని ఆయన వివరించారు. జిల్లా గుండా వెళుతున్న విశాఖ- రాయపూర్ గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారిని అరకు, పాడేరు జాతీయ రహదారిని కలుపుతూ జాతీయ రహదారి 16తో అనుసంధానం చేసి ఈస్ట్ కోస్టు కారిడార్‌గా ఏర్పాటు చేయాలన్నారు. ఈ మేరకు అన్నింటికి ప్రతిపాదనలు సమర్పించామని వివరించారు. వీటిపై చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జాతీయ రహదారుల చీఫ్ ఇంజినీర్‌ను ఆదేశించారు. రహదారులు, భవనల శాఖ ముఖ్య కార్యదర్శి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రాధాన్యతా భవనాలను త్వరగా పూర్తి చేయడానికి జిల్లాకు ప్రాధాన్యతను ఇచ్చి సిమెంట్ సరఫరా చేయాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జెసి సి. విష్ణు చరణ్, డిఆర్ఒ జె. వెంకట రావు, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి. కిరణ్ కుమార్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డాక్టర్ ఎం.వి.ఆర్.కృష్ణాజి, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి ఓ. ప్రభాకర రావు, హౌసింగ్ పిడి పి.రఘురాం, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్, జిల్లా పశుసంవర్ధక అధికారి ఎ.ఈశ్వర రావు, డిపిఒ బలివాడ సత్యనారాయణ, జిల్లా మత్స్య శాఖ అధికారి వి. తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ప్రయివేటీకరణపై రాస్తారోకోలు

ప్రజాశక్తి -పార్వతీపురం

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం బెలగాం జంక్షన్ వద్ద రాస్తోరోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలంతా వ్యతిరేకిస్తున్నా విశాఖ స్టీల్‌ప్లాంటును అమ్ముతామనే అహంకారంతో ముందుకెళ్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేంద్రం రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందన్నారు. రాష్ట్ర విభజన చట్టంలోని ఏ ఒక్క అంశాన్ని అమలు చేయలేదని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయం విరమించుకునే వరకు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతుందన్నారు. అడుగడుగునా దీక్ష, పట్టుదలతో సాగిన సమరశీల పోరాటం ఇదని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు బి.నర్సింగరావు తెలిపారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం అంటే కేంద్ర ప్రభుత్వంతో ఢీకొట్టడమేనని చెప్పారు. రెండేళ్లుగా విశాఖ ఉక్కు ప్రయివేటీకరణపై పోరాటం సాగుతున్నా రాష్ట్ర ప్రభుత్వానికి కనీసం చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కమిటీ నాయకులు సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.సంగం. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు పి.రమణి. సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, శ్రామిక మహిళా నాయకులు వి.ఇందిర, సిఐటియు పట్టణ నాయకులు బి.సూరిబాబు, అవినాష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురంలో రాస్తారోకో చేస్తున్న స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కమిటీ సభ్యులు, కార్మికులు

సీతానగరం : విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణ ఆపాలని స్థానిక హనుమాన్ జంక్షన్‌లో సిపిఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి లక్ష్మునాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, నాయకులు జి.వెంకటరమణ, ఆర్.రమణమూర్తి, సిహెచ్ కృష్ణ పాల్గొన్నారు

కొమరాడ : విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కొమరాడలో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కె.సాంబమూర్తి మాట్లాడారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు లచ్చుము, తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వంద్వ వైఖరి విడనాడాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఆధ్వర్యాన మున్సిపల్ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఆర్.రాము, ఈశ్వరరావు పాల్గొన్నారు.

బలిజిపేట : విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయొద్దని డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యాన స్థానిక బస్టాండ్ వద్ద గురువారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కమిటీ సభ్యులు గేదెల సత్యనారాయణ, వంజరాపు సత్యంనాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో బొద్దాన బాను, నల్ల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు






సీతానగరం, సాలూరు, బలిజిపేటలో రాస్తారోకోలు చేస్తున్న స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కమిటీ సభ్యులు, సిపిఎం, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు

వెనుకబడిన ప్రాంతాల్లో ఆలయ నిర్మాణాలు

టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి



ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-సీతంపేట

గిరిజన, మత్స్యకార, దళితవాడలు, ఇతర వెనుకబడిన ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆలయ నిర్మాణాలు చేపడుతున్నామని టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి తెలిపారు. సీతంపేటలో టిటిడి నూతనంగా నిర్మించిన వెంకటేశ్వర స్వామివారి ఆలయ మహాసంప్రోక్షణ గురువారం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వైవి.సుబ్బారెడ్డి దంపతులు పాల్గొన్నారు. అనంతరం చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి తిరుమలకు విచ్చేసి స్వామివారిని దర్శించుకోలేని యాత్రికుల కోసం గత నాలుగేళ్లలో రెండు తెలుగు రాష్ట్రాల్లో సుమారు 2 వేల ఆలయాల నిర్మాణానికి చర్యలు చేపట్టామని తెలిపారు. సీతంపేటలో ఏడాదిన్నర కాలంలోనే దాదాపు రూ.10 కోట్లతో ఆలయ నిర్మాణం చేపట్టామని చెప్పారు. ఆలయం వద్ద నిర్మించిన కల్యాణ మండపాన్ని మరింతగా విస్తరించి, చుట్టుపక్కల గిరిజనులు ఉచితంగా శుభకార్యాలు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. కురుపాంలో శ్రీవారి ఆలయాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ సందర్భంగా మహాసంప్రోక్షణ అనంతరం ఉదయం 10 గంటలకు భక్తులకు స్వామివారి దర్శనం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ఎమ్‌పి చంద్రశేఖర్, జెఇఒ వీరబ్రహ్మం, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యేలు వి.కళావతి, పుష్పశ్రీవాణి, రెడ్డి శాంతి, కంబాల జోగులు, చిన్న అప్పలనాయుడు, టిటిడి బోర్డు సభ్యులు మల్లాది కృష్ణారావు, ఐటిడిఎ పిఒ కల్పన కుమారి, సబ్ కలెక్టర్ నూరుల్ కోమర్, జిసిసి ఎమ్‌డి జి.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం

వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం సాయంత్రం శ్రీవారి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ముందుగా వేద పండితులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవర్లను కల్యాణవేదిక వద్దకు తీసుకొచ్చారు. అర్చకుల వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ పుణ్యాహవచనం, కంకణధారణ, అగ్నిప్రతిష్ఠాపన, యజమాని సంకల్పం, భక్త సంకల్పం, మహాసంకల్పం, మంగళసూత్రధారణ ఘట్టాలతో వేదమంత్రాలు పఠిస్తూ శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇఒలు గుణభూషణ్ రెడ్డి, వెంకటయ్య, శివప్రసాద్, ఇఇ సుధాకర్, ఎఇఒ రమేష్, డిప్యూటీ ఇఇలు ఆనందరావు, నాగరాజు, జెఇ రవికుమార్, సూపరింటెండెంట్ వెంకటరమణ పాల్గొన్నారు

పిల్లలకు వినోదం, విజ్ఞానం అవసరం

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

పిల్లలకు విజ్ఞానం, వినోదం, వికాసం అవసరమని అది చుట్టూ ఉన్న సమాజంలో కరువైందని ప్రముఖ కవి, రచయిత గంటేడ గౌరినాయుడు అన్నారు. యుటిఎఫ్, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యంలో వేసవి వినోదం పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా చిల్డ్రన్స్ క్లబ్‌లు ఏర్పాటు చేయడంలో భాగంగా గురువారం పార్వతీపురం స్థానిక వేదంతా జూనియర్ కళాశాలలో పార్వతీపురం చిల్డ్రన్స్ క్లబ్ (పిసిసి) వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్ షాప్ కు ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గంటేడ గౌరినాయుడు మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేట్ సరళీకరణ విధానాల అభివృద్ధిలో పిల్లలే సూత్రాధారులుగా నిలుస్తున్నారన్నారు. పాఠ్యపుస్తకాల కన్నా సెల్ ఫోన్లకు, టివీలకు, కంప్యూటర్లకు ఎక్కువ మొగ్గు చూపుతున్నారని, మరికొంత మంది పిల్లలు వారి జీవన కుటుంబ పరిస్థితుల వల్ల చెడు అలవాట్లకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలకు ఆలోచన జ్ఞాపకశక్తి ఎక్కువగా ఉంటుందని, ఇంట్లో గాని, తన చుట్టు ప్రకల జరుగుతున్న పరిణామాలను గాని చాలా త్వరగా, తేలికగా అశ్వదించగరని చెప్పారు. పిల్లలకు శాస్త్రీయ ఆలోచనలను పెంచే సామాజిక అంశాలపై, మంచి చెడులపై, లింగ, కుల వివక్షతలపై చైతన్యం కల్పించడానికి కృషి చేయాలన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్. మురళీమోహన్ మాట్లాడుతూ పిల్లలు మంచికి దూరమవుతున్నారంటే చెడుకు దగ్గరవుతున్నట్లేనని వారికి మంచి భవిష్యత్ అందించాల్సిన బాధ్యత మనందిరిపైన ఉందని అన్నారు. అటువంటి భవిష్యతుకు ఈ పార్వతీపురం చిల్డ్రన్స్ క్లబ్ (పిసిసి) వేదిక కాబోతుందన్నారు. అనంతరం పిల్లలు వేసవి ఎండలకు గురికాకుండా సమ్మర్ క్యాంప్ వేసవి వినోదం పేరుతో న్యూస్ పేపర్లతో బొమ్మలు తయారు చేయడం, దేశభక్తి గేయాలు, డ్రాయింగ్, రింగు ప్లే వంటి రకరకాల ఆటలను నేర్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ జిల్లా కార్యదర్శి జి. జ్యోతి, మధ్యాహ్నం జిల్లా కార్యదర్శి వై. శాంతికుమారి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి. ఇందిరా, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష్యలు తోట రమేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు పి. రాజశేఖర్, హెచ్. సింహాచలం, కె.రాజు, కె. భాస్కర్ పాల్గొన్నారు.



మాటాడుతున్న రచయిత గంటేడ గౌరినాయుడు

జగన్ పాలనలో పెరిగిన నిరుద్యోగం


ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

జగన్ రెడ్డి వన్ చాన్స్‌తో ఆయనకు ముఖ్యమంత్రి పోస్ట్ వచ్చింది కానీ రాష్ట్ర యువతకు మాత్రం అది నో చాన్స్‌గా మిగిలిపోయిందని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అన్నారు. గురువారం మండలంలోని కృష్ణపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుద్యోగ సమస్య చాలా పెరిగిందన్నారు. యువతే దేశానికి భవిష్యత్తు అయితే జగన్ రెడ్డి వారికి సరైన ఉద్యోగావకాశాలు కల్పించడం లేదన్నారు. గతంలో 35 శాతంగా ఉన్న నిరుద్యోగుల సంఖ్య ప్రస్తుతం 73 శాతానికి పెరిగినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయన్నారు. యువతకు ఉద్యోగాలు చూపించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టంచేశారు.

నేడు విశ్రాంత ఐఎఎస్ చెల్లప్ప రాక

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం ఐటిడిఎ మొదటి పిఒ (1985-88)గా విధులు నిర్వహించిన విశ్రాంత ఐఎఎస్ అధికారి ఎస్.చెల్లప్ప గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో పర్యటించనున్నారు. ఈ ప్రాంతంలో జరిగిన అభివృద్ధి, గిరిజనులు ఏ మేరకు అబివృద్ధి చెందారు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలను పరిశీలించనున్నారు. ఆయనతోపాటు పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కూటికొప్పల సూర్యారావు వస్తున్నారు. శుక్రవారం ఉదయం సీతంపేట ఐటిడిఎ ప్రాంతాన్ని, మధ్యాహ్నం పార్వతీపురం ఐటిడిఎ ప్రాంతాన్ని పరిశీలిస్తారు. పార్వతీపురంలో రాత్రి బస చేస్తారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న జిసిసి ఎమ్‌డి సురేష్‌కుమార్

జిసిసి డిపోల్లో తనిఖీలు

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలోని మానాపురం, ధోనిబాయి, అడ్డాకులు గూడలలో గిరిజన సహకార సంస్థ ద్వారా నిర్వహిస్తున్న డిఆర్ డిపోలను గురువారం జిసిసి ఎండి జి. సురేష్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. నిత్యవసర సరుకుల స్టాక్ పాయింట్‌ను రికార్డులను పరిశీలించారు. నిత్యవసర సరుకులు సకాలంలో గిరిజనులకు అందించాలన్నారు. డిఎం, మేనేజర్ ఎప్పటికప్పుడు డిపోలు పర్యవేక్షణ చేయాలన్నారు. గిరిజనులకు అందుబాటులో ఉండాలన్నారు. చింతపండు చీపుర్లు ఎంతకు కొన్నారని అధికారులను ప్రశ్నించారు. అటవి ఉత్పత్తులు కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈయనతో పాటు జిసిడిఎం జి. సంధ్యారాణి, మేనేజర్ గొర్లె నరసింహులు, సూపరిండెంట్ ధర్మారావు, సేల్స్ మెన్లు కె .కాంతారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కలెక్టరేట్

ప్రభుత్వం 2023-24 సంవత్సరానికి అమలుచేయనున్న సంక్షేమ పథకాల వివరాలతో ముద్రించిన జగనన్న ప్రభుత్వ సంక్షేమ కాలెండరును కలెక్టరు కార్యాలయంలో జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ గురువారం విడుదల చేసారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్ట సి. విష్ణు చరణ్, డిఆర్ఒ జె.వెంకట రావు, డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్ కుమార్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి ఎంవిఆర్ కృష్ణాజి, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ. ప్రభాకర రావు, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రఘురాం, డ్వామా పీడీ కె.రామ చంద్ర రావు, జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వీరఘట్టం.. వాలంటీర్లకు నియామకపత్రాలు అందిస్తున్న ఎంపిపి వెంకటరమణ

వాలంటీర్లకు నియామక పత్రాలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని నూతనంగా నియమితులైన వాలంటీర్లకు గురువారం ఎమ్మెల్యే అలజంగి జోగారావు తన క్యాంపు కార్యాలయంలో నియామాక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ క్లష్టర్ల పరిధిలోని 50 కుటుంబాలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి అందేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కె.విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : బాధ్యతగా విధులు నిర్వహించాలని ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు నూతనంగా ఎంపికైన గ్రామ వాలంటీర్లకు సూచించారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గ్రామ వాలంటీర్లకు నియామక పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా చేరవేయాలని సూచించారు. ఏ ఒక్కరి నుంచి ఫిర్యాదు వచ్చినా సహించేది లేదని స్పష్టంచేశారు. ఈ సందర్భంగా మండలంలోని బిటువాడ, పివిఆర్ పురం, చిట్టి పూడి వలస, హుస్సేన్ పురం, మూలలంక, వీరఘట్టం, చిదిమి గ్రామాల నుండి 8 మందికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వై.వెంకటరమణ, వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ కె.ఎల్.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వరి విత్తనాలు సిద్ధం

ప్రజాశక్తి-సీతంపేట

వ్యవసాయ పరిశోధన స్థానంలో వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పి.సీతారాం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంటియు 1061, 1064 విక్రయించడానికి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. కిలో విత్తనాలు ధర రూ.35.. 25 కిలోల బస్తా రూ.875గా తెలిపారు. వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటలకు విత్తనాలు విక్రయిస్తారని తెలిపారు.

వైటిసిలో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-సీతంపేట

ఐటిడిఎ ఆధ్వర్యంలో సీడాప్, అగ్రికల్చర్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ గిరిజన యువతకు సీతంపేట వైటిసిలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటిడిఎ పిఒ కల్పన కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాలంలో ఉచితంగా భోజనం, వసతి కల్పించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు వైటిసి మేనేజర్ వెంకటరమణ (7032060773, 9550120683) కు సంప్రదించాలని కోరారు.

సిబ్బంది అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి-సీతానగరం

గ్రామ సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలని ఎంపిడిఒ ఎంఎస్‌ఎన్‌ఎల్ ప్రసాద్ అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ సెక్రటరీ గ్రామ సచివాలయానికి 10 గంటలకు హాజరుకావాలన్నారు. సచివాలయ సిబ్బంది యూనిఫాం ధరించాలని, సమయపాలన పాటించాలని ఆదేశించారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను పరిష్కరించే దిశగా సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బందలుప్పిలో గడపగడపకు..

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

మండలంలోని బందలుప్పి గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం, గురువారం వరుసగా నాలుగవ రోజు కొనసాగింది. స్థానిక సర్పంచ్ ఏళ్ల ప్రమీలతో కలిసి పలు వీధులను సందర్శించిన ఆయన లబ్ధిదారులతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి గ్రామస్తులు పలు సమస్యలు తీసుకురాగా ఆయన అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి బలగ రేవతి, ఎంపిపి మజ్జి శోభారాణి, ఎంఎంసి చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, వైస్ ఎంపిపి సిద్దా జగన్నాధం, నాయకులు ఏళ్ల ప్రతాప్, బంకపల్లి రామకృష్ణ, గణపతి బొమ్మి రమేషు తదితరులు పాల్గొన్నారు.

భూ అభివృద్ధి పనులు పరిశీలన

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో కుసిమి పంచాయతీ మల్లి కాలనీలో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహిస్తున్న భూ అభివృద్ధి పనులను ఎంపిడిఒ కొండపల్లి సత్యం గురువారం పరిశీలించారు. 270 రూపాయలు వేతనం వచ్చేటట్లు కొలతలు ఇవ్వాలని ఎపిఒకు ఆదేశించారు. పని చేసే చోట అన్ని సౌకర్యాలూ ఉండాలన్నారు. అనంతరం మస్తర్లు తనిఖీ చేశారు. వేతనాలు సకాలంలో చెల్లించాలన్నారు. ఈయన వెంట ఎపిఒ బాబురావు, సాగర్, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

సిట్ ఏర్పాటుపై సుప్రీం తీర్పు చారిత్రాత్మకం

చంద్రబాబు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు : డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు

టిడిపి ప్రభుత్వం హయాంలో జరిగిన అవినీతి అక్రమాలపై సిట్ విచారణకు అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైనదని డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ అమరావతి సహా ఎపి ఫైబర్ నెట్, ఎపి స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్‌లో భారీ కుంభకోణాలు జరిగాయని భావించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. దీనిపై టిడిపి అధినేత చంద్రబాబునాయుడు హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారని చెప్పారు. ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పు టిడిపి నాయకుల గుండెల్లో రైళ్ళు పరుగెట్టిస్తోందని చెప్పారు. చంద్రబాబు మాత్రం పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ సిఎం జగన్‌పై ఎదురుదాడి చేస్తున్నారని ఆరోపించారు. సిఎం జగన్ మోహన్ రెడ్డి పై కేసులు వున్న మాట వాస్తవమేనని, వాటిపై ఆయన న్యాయబద్ధంగా పోరాడుతున్నారని చెప్పారు. మాజీ సిఎం చంద్రబాబు నాయుడు కూడా 18కేసుల్లో బెయిల్ తెచ్చుకున్నారని గుర్తు చేశారు. సిట్ దర్యాప్తు మొదలైతే రాష్ట్రంలో అలీబాబా దొంగల ముఠా ఎవరిదో తెలిసిపోతుందని చెప్పారు. ఎపి ఫైబర్ నెట్‌లో రూ.250కోట్లు, ఎపి స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్‌లో రూ. 350కోట్లు కుంభకోణం జరిగినట్లు ఆధారాలు వున్నాయని ఆరోపించారు. అమరావతి రాజధానికి భూముల సేకరణలో పెద్ద ఎత్తున కుంభకోణం జరిగిందని తెలిపారు. రాజధాని ఎక్కడ పెట్టాలో నిర్ణయించుకుని తన బంధువులు, మంత్రులు ఎమ్మెల్యేల చేత ఆ ప్రాంతంలో భూములు కొనుగోలు చేయించిన ఘనత చంద్రబాబు నాయుడు దేనని చెప్పారు. సిట్ దర్యాప్తు మొదలైతే బాబు రియల్ ఎస్టేట్ బాగోతమంతా బయటికి వస్తుందని చెప్పారు.

జనసేన అధినేత ఇప్పుడైనా కళ్ళు తెరవాలి

సుప్రీం కోర్టు తీర్పుతోనైనా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కళ్ళు తెరవాలని డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. ఈ తీర్పుతో పవన్ కళ్యాణ్‌లో మార్పు వస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఎందుకంటే గతంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మాజీ సిఎం చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్‌లపై తీవ్ర విమర్శలు చేశారని గుర్తు చేశారు. అలాంటి టిడిపి జెండాని, అజెండాని పవన్ కళ్యాణ్ మోయడం విడ్డూరంగా ఉందన్నారు. వ్యక్తి గతంగా తాను పవన్ కళ్యాణ్‌ని అభిమానిస్తానని, ఆయన రాష్ట్రానికి సిఎం అయితే సంతోషిస్తానని అన్నారు. పవన్ కళ్యాణ్ అభిమానులు, జనసేన కార్యకర్తలు ఇప్పటికైనా సొంత జెండా, సొంత అజెండాతో పని చేయాలని డిప్యూటీ సీఎం రాజన్నదొర హితవు పలికారు.

నాడు-నేడు పనులు వేసవిలో పూర్తిచేయాల్సిందే

ఐటిడిఎ పిఒ కల్పనకుమారి ● నలుగురికి షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి-సీతంపేట

పాఠశాలలకు వేసవి సెలవుల సమయంలోనే నాడు-నేడు పనులను పూర్తి చేసుకోవాలని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అన్నారు. గురువారం మండలంలోని దేవనాపురం ప్రాథమిక పాఠశాలను పిఒ పరిశీలించారు. ఈ సందర్భంగా నాడు-నేడు పనులు ఎందుకు చేయట్లేదని పిఒ ప్రశ్నించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, పాఠశాల టీచర్ ఎందుకు పర్యవేక్షణ చేయట్లేదని అడిగారు. వారి వద్ద నుండి సమాధానం లేకపోవడంతో ముగ్గురికి షోకాజ్ నోటీస్ ఇస్తున్నట్లు తెలిపారు. దేవనాపురం అంగన్వాడీ సెంటర్‌ను పరిశీలించారు. అంగన్వాడీ కార్యకర్త పనివేళలు సక్రమంగా పాటించట్లేదని, మెనూ ప్రకారం భోజనం ఎందుకు పెట్టట్లేదని మహిళా పోలీస్‌ని అడిగారు. పర్యవేక్షణ చేయలేదా? అని ప్రశ్నించారు. దీనిపై మహిళా పోలీసుకు షోకాజ్ నోటీసు ఇస్తున్నట్లు పిఒ తెలిపారు. అంగన్వాడీ సెంటర్ పై విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని సూపర్ వైజర్‌ను ఆదేశించారు.

అనంతరం జగతిపల్లి వ్యూ పాయింట్‌ను పరుశీలించారు. పనులు ప్రారంభం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడారు. అదే విధంగా జాతాపు జగతిపల్లి నుంచి కోసంగి గూడ రోడ్డు పనులను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

ఐటిడిఎ పరిధిలో ఉన్న ముక్కిడిపోలమ్మ విడివికె కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో తయారుచేస్తున్న చీపుర్లు, జీడి ప్రాసెసింగ్ యూనిట్, బిస్కెట్ల తయారీ, అగర్ బత్తీల తయారీ విధానాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇఇ జి.మురళి, డిఇ కృష్ణ, ఎఇ శ్రీవిద్య, వైకెపి ఎపిడి ఆర్.వి.రమణ, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గృహాల మంజూరుకు హామీ

మెట్టుగూడ గ్రామంలో ఇటీవల వర్షాలకు పూర్తిగా పాడైపోయిన ఇళ్లను ఐటిడిఎ పిఒ కల్పనకుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా సవర చిన్న భూదమ్మ, సవర చంద్రమ్మ ఇళ్లను పరిశీలించి, వారికి గృహాలను మంజూరు చేస్తామని హామీనిచ్చారు. వెంటనే ఇళ్ల పనులు ప్రారంభించుటకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. వీరితోపాటు రేకుల ఇళ్లల్లో ఉన్న ఏడుగురికి కూడా గృహాలు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ హరికృష్ణ, హౌసింగ్ ఎఇ సిహెచ్ వెంకటేష్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గిరిజన మహిళతో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కల్పనకుమారి

గోకులాల బిల్లులు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి-సీతానగరం

గత ప్రభుత్వ హయాంలో రైతులు నిర్మించిన గోకులాల బిల్లులను చెల్లించాలని సిపిఎం జిల్లా నాయకులు రెడ్డి లక్ష్మునాయుడు, రెడ్డి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో గత ప్రభుత్వ హయాంలో రైతులు గోకులం పథకంలో భాగంగా గోశాలలను నిర్మించుకున్నారని, నేటికీ బిల్లులు చెల్లించకపోవడంతో రైతులు నానా ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. అనంతరం ఎంపిడిఒ ఎంఎస్‌ఎల్‌ఎన్ ప్రసాద్‌కు సమస్యను విన్నవించారు. వెంటనే ఆయన ఉపాధి హామీ ఎపిఒ, టెక్నికల్ అసిస్టెంట్‌ను పిలిచి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం నాయకులు రెడ్డి రమణమూర్తి, సిహెచ్.కృష్ణ, పి.విశ్వనాథం, ఆర్.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వాహనచోదకులు జాగ్రత్తలు పాటించాల్సిందే

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

వాహనచోదకులు జాగ్రత్తలు పాటించకపోతే చట్టం నుంచి తప్పించుకోలేరని పట్టణ సిఐ పివివిఎస్ఎన్ కృష్ణారావు హెచ్చరించారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయనతోపాటు ఎస్‌ఐ ఫకృద్దీన్ విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు నివారించడం కోసం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నట్లు చెప్పారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు వాహనాలు డ్రైవింగ్ చేయరాదన్నారు. లైసెన్స్ లేని వారికి వాహనాలను ఇస్తే యజమానులకు ఇబ్బందులు తప్పవన్నారు. ఇటీవల కాలంలో జరిగిన ఘటనలే అందుకు నిదర్శనమన్నారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడపకూడదని, రాంగ్ రూటులో డ్రైవింగ్ చేయరాదని సూచించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, పాటలు వింటూ, చాటింగ్ చేస్తూ, మద్యం సేవించి వాహనాలు నడపరాదని చెప్పారు.

రీ సర్వేలో జాగ్రత్తలు తప్పనిసరి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ప్రభుత్వం ఎంత ప్రతిష్టాత్మక చేపట్టిన జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో రీసర్వే చేస్తున్నప్పుడు కచ్చితంగా జాగ్రత్తలు పాటించాలని రీసర్వే ప్రత్యేకాధికారి పి.వెంకటరమణ తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జె.రామ అప్పలనాయుడు, టౌన్ ప్లానింగ్ అధికారి పి.కనకారావు, వార్డు సచివాలయాల టౌన్ ప్లానింగ్ సెక్రటరీలతో సమీక్షించారు. రీ సర్వేలు ఏ ప్రాతిపదికన పూర్తి చేయాలో ప్రదర్శన ద్వారా వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యజమాని దగ్గర ఉన్న డాక్యుమెంట్లను పూర్తి స్థాయిలో పరిశీలించాలన్నారు. ఆ స్థలానికి హద్దుల వివరాలను, ప్రభుత్వ స్థలాల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి హద్దులను నిర్ణయించాలని చెప్పారు. సంబంధిత స్థల యజమానులకు నివేదికను అందజేసి అభ్యంతరాలుంటే గడువులోగా తెలపాలని సూచించాలన్నారు. అనంతరం ప్రభుత్వానికి నివేదికను ఇవ్వాలని, ప్రభుత్వ సూచనల మేరకు నిర్ణీత సమయంలో రీ సర్వేను పూర్తి చేయాలని, సూచించారు.



ప్రదర్శన ద్వారా సర్వేపై అవగాహన కల్పిస్తున్న రీసర్వే ప్రత్యేకాధికారి వెంకటరమణ

సక్రమంగా స్టోన్ ప్లాంటేషన్

రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ కెజియా కుమారి

ప్రజాశక్తి - కొమరాడ

రీసర్వే ప్రక్రియలో స్టోన్ ప్లాంటేషన్ సమర్థవంతంగా జరగాలని రీ సర్వే విభాగానికి చెందిన రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ కెజియా కుమారి అన్నారు. మండలంలోని స్టోన్ ప్లాంటేషన్ జరుగుతున్న విక్రమపురం గ్రామాన్ని ఆమె గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె స్టోన్ ప్లాంటేషన్ పరిశీలిస్తూ టెక్నికల్‌గా ఏవైనా సమస్యలు ఉంటే తక్షణమే తెలియజేయాలన్నారు. స్టోన్ ప్లాంటేషన్‌లో ఎటువంటి తప్పులూ జరగకుండా సక్రమంగా చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. హద్దురాళ్ళ పాయింటు అత్యధిక ఆధునికరణతో గుర్తింపు జరుగుతుందన్నారు. హద్దురాళ్ల పాతే సమయంలో సక్రమంగా ఖచ్చితమైన పాయింట్లు గుర్తించి రాళ్ల పాతాలని సిబ్బందికి ఆదేశించారు. హద్దురాళ్ల పాతి పెట్టే సమయంలో సంబంధించిన పక్క రైతులకు కూడా సమక్షంలోనే నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం మండలంలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియ పై తహశీల్దార్ సిహెచ్ రాధాకృష్ణ పూర్తి వివరాలు ఆమెకి తెలియజేశారు. ఈయనతోపాటు మండల సర్వే స్వామి నాయుడు, విఆర్‌ఒలు, సర్వే సిబ్బంది ఉన్నారు.



రీసర్వేను పరిశీలిస్తున్న ఆర్‌డిడి కెజియా కుమారి

గిరిజనుల సంక్షేమం మరిచిన ప్రభుత్వం



గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు, టిడిపి కార్యకర్తలు

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

తాము అధికారంలోకి వస్తే ప్రజలను ఉద్ధరిస్తామని మాయ మాటలు చెప్పిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్, అధికారంలోకి రాగానే గిరిజనులకు చెందిన సంక్షేమ పథకాలన్నీ నిలుపుదల చేశారని టిడిపి పార్వతీపురం నియోజకవర్గ ఇంచార్జి బొబ్బిలి చిరంజీవులు అన్నారు. గురువారం మండలంలోని చందలంగి గ్రామంలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదాయానికి మించి అప్పులు చేసి రాష్ట్ర జనాభా పై రుణభారం పెంచడమే కాకుండా, మారుమూల గిరిజన గ్రామాలు, దళితవాడలలో కనీస అభివృద్ధి లేకుండా చేసి వారికి మౌలిక సదుపాయాలకు దూరంగా ఉంచుతున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో గిరిజన గ్రామాలలో అభివృద్ధి పనులు నిర్వహించిన కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకుండా చేసి, మండలంలోని పలు గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం లేకుండా చేశారన్నారు. అనంతరం కార్యకర్తలతో కలిసి గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గొట్టాపు వెంకట నాయుడు, బోను చంద్రమౌళి, రెడ్డి చిన్నంనాయుడు, బేత లక్ష్మణరావు, శ్రీధర్ భుడితి శ్రీరామ్, బంకపల్లి అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి-వీరఘట్టం

మండల కేంద్రంలోని మందిరం వీధిలో గురువారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి జ్వర పీడితులకు, చిన్నారులకు, గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఒ.శాంతికుమారి, ఎంఎల్‌హెచ్ పి కావ్య, టెక్నీషియన్ దినేష్, ఎఎన్‌ఎం ఎస్.జానకి బాయ్, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని లక్ష్మీపురంలో గురువారం పెదంకలాం పిహెచ్‌సి వైద్యాధికారి ఎం.రాధాకాంత్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులను తనిఖీలు చేశారు. రక్త పరీక్షలు చేశారు. అనంతరం మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా రోగులకు సేవలు సక్రమంగా అందిస్తున్నట్లు వైద్యాధికారి తెలిపారు. గ్రామ స్తులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎస్ మూర్తి, హెల్త్ అసిస్టెంట్ వెంకటేష్, ఎంఎల్‌హెచ్ కె.కీర్తి, ఎఎన్‌ఎం బి.రమాదేవి, ఆశాకార్యకర్త టి.రమాదేవి పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న జగదీశ్వరి

జీడి రైతులకు పరిహారం అందించాలని వినతి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

వాతావరణ పరిస్థితులతో జీడి పంట నష్టపోయిన గిరిజన రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని గుమ్మలక్ష్మీపురం తహశీల్దార్ రాములమ్మకు టిడిపి కురుపాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి గురువారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జగదీశ్వరి మాట్లాడుతూ గత మూడేళ్ల నుంచి జీడి పంట చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాలు, కారు మబ్బులు, దోమ కాటు కారణంగా పంట పూర్తిగా దిగుబడి తగ్గడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఎక్కువ శాతం మంది గిరిజనులు చింత, జీడి పంటలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి అధికారులతో సమగ్ర సర్వే చేయించి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎసి సురేష్

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ డివివి సురేష్ కుమార్ గురువారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావును మర్యాదపూర్వకంగా గురువారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు శాలువా కప్పి సన్మానించారు.

ప్రకృతి వ్యవసాయ గ్రామంగా చాపరాయివలస

ప్రజాశక్తి-పాచిపెంట

చాపరాయివలసను పూర్తి స్థాయి ప్రకృతి వ్యవసాయ గ్రామంగా మార్చడానికి కృషి చేయాలని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. ఆ గ్రామంలో గురువారం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి సేద్య సిబ్బంది, గ్రామపెద్దల సహకారం తీసుకోవాలన్నారు. గ్రామంలో ముఖ్యంగా పత్తి, మొక్కజొన్న పంటలు పండిస్తారని తెలిపారు. పత్తి పంట చుట్టూ జొన్న పంట రెండు వరుసలలో వేసుకోవాలని చెప్పారు. పత్తి వరుసల మధ్య చిరుధాన్యాలు లేదా అపరాలు పండించుకోవాలని సూచించారు. దీనివల్ల చీడపీడల నివారణ జరగడమే కాకుండా జీవ వైవిధ్యం పెరిగి అదనపు ఆదాయం వస్తుందని తెలిపారు. ఎంపిటిసి చదల రాజు మాట్లాడుతూ గ్రామస్తుల సహకారం ఉంటే తప్పనిసరిగా ఏడాదిలో ప్రకృతి సేద్య గ్రామంగా మార్చవచ్చన్నారు. గతంలో లేని పసుపు పంటను గ్రామస్తులకు అలవాటు చేశామని చెప్పారు. చిరుధాన్యాలు విత్తనాలు త్వరగా అందించాలని కోరారు. చింత చెట్లు గ్రామంలో తక్కువగా ఉన్నాయని, జీడి మామిడి దిగుబడి తక్కువగా ఉందని తెలిపారు. ఈ రెండింటిపై దృష్టి పెడితే గిరిజనుల ఆదాయం బాగుంటుందని చెప్పారు. పాస్టర్ సన్యాసిరావు మాట్లాడుతూ రసాయన ఎరువులపై ఖర్చు తగ్గించుకుని, ప్రకృతి సాగు పద్ధతులు అలవాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం ప్రకృతి సేద్య మండల కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘన, ద్రవ జీవామృతం, కషాయాల తయారీ ఉపయోగాల గురించి రైతులకు వివరించారు.



కషాయాల తయారీపై అవగాహన కల్పిస్తున్న ఎఒ తిరుపతిరావు

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో గల శివన్నపేట గ్రామంలో రామ మందిర నిర్మాణానికి గురువారం మేజర్ పంచాయతీ సర్పంచ్ జి. సుజాత, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, గ్రామ పెద్దలు భూమి పూజ చేశారు. ఈ రామాలయ నిర్మాణానికి ముందుగా తూరుబిల్లి ఆనందరావు అనే దాత రూ. 5 లక్షలు విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్మాణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ సుమారు రూ.60 లక్షలు నిధులతో నిర్మాణ పనులు చేపడుతున్నామని దాతలు ఎవరైనా ఉంటే నిర్మాణానికి సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అందవరపు కోటేశ్వరరావు, బరాటం గుంపు స్వామి, వైసిపి జిల్లా గ్రీవెన్స్ అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కె సురేష్ కుమార్, స్థానిక ఎంపిటిసి వి. బంగారు నాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు కె. గౌరీ శంకర్రావు యువత పాల్గొన్నారు.

ఫిర్యాదుపై డిఎస్‌పి విచారణ

ప్రజాశక్తి -భామిని

మండలంలోని చిన్నదిమిలి గ్రామానికి చెందిన కుప్పిలి రాములమ్మ అదే గ్రామానికి చెందిన సాసూపిల్లి లక్ష్మి నారాయణపై పెట్టిన భూ సంబంధింత, ఎస్‌సిఎస్‌టి అట్రాసిటీ కేసుపై ఎస్‌సి, ఎస్‌టి సెల్ డిఎస్‌పి మురళీధర్ గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఈ ఫిర్యాదుపై మరలా క్షేత్ర స్థాయిలో ఫీజికల్‌గా స్థానిక సర్వేయర్‌తో భూ అంశాలు, రికార్డ్స్ పరిశీలిస్తామని డిఎస్‌పి తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎన్. అప్పారావు, సర్వేయర్ రామ్మోహన్, ఆర్‌ఐ రాంబాబు, ఎస్‌ఐ వై. అమ్మన్నారావు వున్నారు.

103 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని వండువ జంక్షన్ వద్దనున్న షిరిడి సాయిబాబా ధ్యాన మందిరంలో శ్రీకాకుళం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో గురువారం శంకర్ ఫౌండేషన్ సహకారంతో నేత్ర వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ శిబిరంలో 103 మందికి ఆప్తాలమిస్టు జాక్షన్ కంటి పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. 61 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసి, విశాఖపట్నంలోని శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన వారికి భోజన సదుపాయం కూడా కల్పించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఎం.సింహాచలం, క్యాంప్ ఇన్‌ఛార్జి సిహెచ్ వెంకటరమణ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.